

వాహనం కొంటున్నారా.. జర భద్రం

బైక్ కొనాలని చాలామందికి ఉంటుంది.అయితే పాత వాహనం కొంటున్న వారు జాగ్రత్తలు పాటించకపోతే చిక్కులు తప్పవని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. -8లో



మద్యంమత్తు..తీసింది ప్రాణం

మద్యం మత్తు ముగ్గురి ప్రాణాలు తీసింది. ఒకరు భార్యను నరికి చంపగా.. మరొకరు బామ్మర్దిని దిమ్మెతో కొట్టి చంపారు. మద్యం తాగిన ఆటోడ్రైవర్‌ను బండరాయితో కొట్టి చంపేశారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.690	రూ.800
రెండోరకం	రూ.540	రూ.680



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 603 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	465	465
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 85.940 కిలోలు

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- కష్టాలు కొంతకాలమే.. మున్ముందు మంచికాలం
- పులివెందుల కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలతో మాజీ సీఎం వైఎస్ జగన్



భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



సాక్షి కడప/పులివెందుల: 'ఎప్పుడూ చీకటే ఉండదు. వెన్నెల కొంత కాలం చీకట్లు కొద్దిరోజులు అన్నట్లే కష్టాలు శాశ్వతం కాదు. మంచి కాలం మున్ముందు కచ్చితంగా ఉంటుంది. కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దు. పార్టీ అండగా ఉంటుంది. ధైర్యంగా ముందుకు వెళ్లడమే విధిగా అడుగులు పడాలి. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలందరికి అన్ని హామీలు అమలు చేసి తిరుగులేని ప్రభుత్వంగా నిలిచాం. ఎవరూ భయపడవద్దు.. ధైర్యంగా ముందుకు వెళ్లాలి..' అని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పులివెందులలోని క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో మమేకమైన సందర్భంగా పలువురితో మాజీ ముఖ్యమంత్రి మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని వివరించారు. రానున్న కాలంలో ప్రతీ కార్యకర్తకు తనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏ కష్టం వచ్చినా తోడుగా ఉంటుందని భరోసానిచ్చారు.

పులివెందులలో కార్యకర్తలతో మమేకం

పులివెందులలోని భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలు, నేతలు ఇలా తరలివచ్చిన అందరితో మాజీ సీఎం వైఎస్ జగన్ మమేకమయ్యారు. ప్రధానంగా పలువురు మహిళలు వచ్చి సమస్యలను విన్నవించారు. కార్యకర్తలను, నేతలను మాజీ సీఎం పేరుపేరునా పలకరించారు. అంతేకాకుండా వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం 4.30గంటల ప్రాంతం నుంచి రాత్రి 8.10గంటల వరకు క్యాంపు కార్యాలయంలోనే ప్రజలతో కలిసిపోయారు.

కార్యాలయం వద్ద కిక్కిరిసిన జనసందోహం

పులివెందులలోని క్యాంపు కార్యాలయం కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, ప్రజలతో కిక్కిరిసిపోయింది. కార్యాలయం బయట, లోపల ఎక్కడ చూసినా జనమే జనం. ఇక్కడే కాకుండా మాజీ సీఎం ఇంటి ప్రాంగణమంతా కూడా కార్యకర్తలతో నిండిపోయింది. మాజీ సీఎం కాన్వాయ్ క్యాంపు కార్యాలయ ఆవరణంలోకి రాగానే ఒక్కసారిగా శ్రేణులంతా కాన్వాయ్‌వైపు వెళ్లడంతో పోలీసులు కూడా అదుపు చేయలేకపోయారు. క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎంను కలిసే క్రమంలో కార్యకర్తలు తోసుకోవడంతో పులివెందులకు చెందిన ఫయాజ్ అనే యువకుడు కిటికీ అద్దాలు తగలడంతో అద్దం పగిలి చిన్నపాటి గాయమైంది.

నేతలతో కాసేపు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో పాటు మాజీ నేతలతో కూడా మాజీ సీఎం వైఎస్ జగన్ చర్చించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీల జిల్లా అధ్యక్షులు, ఇతర మాజీ నామినేటెడ్ కేడర్ నేతలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్‌లు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు కలిసి పరిస్థితులపై చర్చించారు.

కడప విమానాశ్రయంలో వైఎస్ జగన్‌కు అపూర్వ స్వాగతం

కడప కార్పొరేషన్: ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి జిల్లా పర్యటనకు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కడప విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చారు. గన్నవరం విమానాశ్రయం నుంచి సరిగ్గా 12.45 గంటలకు కడప విమానాశ్రయం చేరుకున్న వైఎస్సార్‌సీపీ అధినేతకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, కడప మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ప్రభుత్వ విప్‌లు కొరముట్ల శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయటికి రాగానే యువకులు జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆయన్ను కలవడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి పోటీలు పడ్డారు. ఈ క్రమంలో కొద్దిగా తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌బి అహ్మద్‌బాషా, పి. జయచంద్రారెడ్డి, పులి సునీల్, కరిముల్లా, సుభాన్‌బాషా, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



వైఎస్ జగన్‌తో కరచాలనం చేసేందుకు పోటీ పడుతున్న అభిమానులు



వైఎస్ జగన్‌ను చూసి విలపిస్తున్న వృద్ధురాలు



వృద్ధురాలిని ఓదారుస్తున్న వైఎస్ జగన్



మార్గమధ్యంలో వైఎస్ జగన్‌ను చూసిన ఆనందంలో..

సాక్షి ప్రతినిధి, కడప: ఐదేళ్ల మహిళామణులకు అన్నీ తానై అండదండగా నిలిచారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అహర్నిశలు తపించారు. ప్రతి పథకంలోనూ మహిళలకు ప్రాధాన్యత కల్పించారు. ఆ అభిమానం నారీలోకంలో గూడు కట్టుకుపోయింది. అయితే ఐదేళ్లకోసారి లభించే ప్రజా తీర్పులో ఆ అభిమాన నేత ఓటమిపాలయ్యారు. అయినా వారిలో ఉన్న మమతానురాగాలు చెక్కు చెదరలేదు. తామెంతో అభిమానించే జననేతను చూడగానే ఉబికి వస్తున్న కన్నీళ్లను పంటిబిగువన ఆపుకునే వారు కొందరైతే, బోరున ఏడ్చేవారు మరికొందరయ్యారు. ప్రతి ఒక్కరి హృదయాలను కదిలించే ఈ దృశ్యాలు శనివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప నుంచి పులివెందులకు వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపై కనిపించాయి.

- ఎన్నికల ఫలితాల తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారిగా శనివారం పులివెందుల పర్యటనకు వచ్చారు. కడప విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన పులివెందులకు బయలుదేరారు. జిల్లాలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున కడపకు చేరుకున్నారు. వైఎస్ జగన్ కాన్వాయ్ వెంట అనుసరించారు. దాదాపు 2 కిలోమీటర్ల పొడవునా

తరగని అభిమానం

కార్ల కాన్వాయ్ కొనసాగింది. ప్రతి చోటా కాన్వాయ్ ఆపడం, తనను చూసేందుకు వచ్చిన ప్రజలకు అభివాదం చేస్తూ మాజీ సీఎం ముందుకు కదిలారు.

పులివెందుల చేరేందుకు నాలుగు గంటల సమయం..

కడప నుంచి పులివెందుల చేరుకునేందుకు వీఐపీ కాన్వాయ్ గంట లేదా గంటన్నర సమ యం పడుతుంది. కాగా, శనివారం కడప నుంచి పులివెందుల చేరుకునేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 4 గంటల సమయం పట్టింది. కాన్వాయ్‌లో వాహనాలు సుమారు 2 కిలోమీటర్ల పొడవునా బారులు తీరాయి. రోడ్డుపైకి వచ్చిన గ్రామీణులకు అభివాదం చేస్తూ, మహిళలను ఓదారుస్తూ వైఎస్ జగన్ కదిలారు. బేస్తవారిపల్లెలో చిన్నారులను భుజానికెత్తుకుని లాలించారు. ఈ దృశ్యం అభిమానులకు కనువిందు చేసింది. ఇలా ప్రజల ప్రేమాభిమానాల మధ్య పులివెందుల చేరుకునేందుకు నాలుగు గంటలు పైగా సమయం పట్టడం విశేషం.

బోరున విలపించిన మహిళలు..

పులివెందుల రోడ్డు మార్గంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వెళ్తున్నారని తెలుసుకున్న గ్రామీణులు ఆయా గ్రామాల వద్ద రోడ్డుపైకి వచ్చి చేరారు. రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా మహిళలు జగన్‌ను చూసేందుకు ఎగబడ్డారు. ఈ క్రమంలో వైఎస్ జగన్‌ను చూడగానే మహిళలు బోరున విలపించారు. వెల్లటూరులో ఆరు పదుల వయస్సు దాటిన ఓ మహిళ అందరూ కూడబలుక్కుని అన్యాయం చేశారే కొడుకా అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఇలా గ్రామ గ్రామాన మహిళలు తండోపతండాలుగా రోడ్డుపైకి వచ్చి, అభిమాన నాయకున్ని చూడగానే వారిలో ఉన్న ప్రేమాభిమానాలు గుప్పించారు. గుర్రాలచింతలపల్లె, ఇందిరానగర్, కొత్తూరు, వేంపల్లె, తాళ్లపల్లె, వి.కొత్తపల్లె, వేముల, వేల్పుల, బేస్తవారిపల్లె ఇలా దారి వెంబడి మహిళలు ఉద్వేగానికి లోనయ్యారు. మహిళలు ఆయా జంక్షన్లలో పిట్టగోడలు ఎక్కి జగన్ కోసం ఎదురు చూశారు. వేంపల్లె హన్‌మాన్ జంక్షన్‌లో మస్తాన్‌బీ అనే మహిళ తన ఆవేదనను ఆపుకోలేక ఒక్కమారుగా కన్నీరు పెట్టుకున్నారు. నాయనా...నువ్వు బాగుండాలి.. మా పాలిట దేవుడివి అంటూ అభిమానాన్ని చాటుకున్నారు. వేల్పులలో మహిళలు మూకుమ్మడిగా రోడ్డుపైకి వచ్చి మేమంతా నీ వెంటే అంటూ నినాదాలు చేశారు.

న్యూస్‌రీల్

శ్రీ లక్ష్మీనరసింహునికి విశేష పూజలు



స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

లోక్ అదాలత్ పరిష్కార వేదిక కావాలి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి

రాయచోటి టౌన్: ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ పరిష్కార వేదిక కావాలని జిల్లా ఐదవ అదనపు న్యాయమూర్తి కృష్ణన్ కుట్టి పేర్కొన్నారు. శనివారం కోర్టు ఆవరణంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పోలీసులు, న్యాయవాదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేందుకు సహకరించాలని కోరారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసిఫా సుల్తానా, డాక్టర్ కె. శారద పాల్గొన్నారు.

వైభవం...రామయ్య కల్యాణం



ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో ఆశీనులు చేసిన దృశ్యం



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

ఒంటిమిట్ట: రెండో అయోధ్యగా ఖ్యాతి చెందిన ఒంటిమిట్ట రామాలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ముందుగా కళ్యాణ వేదికను ముస్తాబు చేసి ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, పుష్ప మాలికలతో అలంకరించారు. అనంతరం అర్చకులు అంగరంగ వైభవంగా కళ్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కడప దిశా డీఎస్పీ రమాకాంత్, కడప ఆర్డీఓ మధుసూదన్ వీక్షించారు. వీరితోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న న్యాయమూర్తులు

ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయాన్ని హర్యానా రాష్ట్ర హైకోర్టు జడ్జి సురేంద్ర గుప్తా, పంజాబ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి అంకిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ లాంచనాలతో స్వాగతం పలికి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయరంగ మండపంలో సేదతీరి స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోటలో శిల్పసంపద అద్భుతం



సిద్ధవటం కోటను సందర్శించిన హర్యానా, పంజాబ్, హైకోర్టు జడ్జిల కుటుంబ సభ్యులు

సిద్ధవటం: మట్లి రాజుల కోటలో శిల్పసంపద చాలా అద్భుతంగా ఉందని హర్యానా హైకోర్టు జడ్జి జస్టిస్ సురేంద్ర గుప్త, పంజాబ్ హైకోర్టు జడ్జి జస్టిస్ అంకిత అన్నారు. సిద్ధవటంలోని మట్లిరాజుల కోటను శనివారం వారు కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వారు కోట ముఖ ద్వారం, మొదటి మండపం, రెండో మండపం, ఈద్గా, కోనేరు, ఢంకానగర్, శిలా శాసనం, పార్క్, దెబ్బతిన్న నంది విగ్రహం, తవ్వకాల్లో బయల్పడిన శివలింగం, కామాక్షమ్మ గుడి, పర కోటలోని సయ్యద్‌షా బిస్మిల్లా షాఖాద్రి దర్గా, రాణి స్నాన వాటిక, రాణీమహల్, రాజ మహల్, పెన్నా నదీ ప్రవాహాన్ని వారు తిలకించారు. కోటలో కట్టడాలు నాటి రాజుల పరిపాలనకు చిహ్నంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం పురాతత్వ కట్టడాలను పరిరక్షించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లా కోర్టు సిబ్బంది, సిద్ధవటం కోర్టు సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం జలాశయానికి కృష్ణా జలాలు

కొండాపురం: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయంలోకి 400 క్యూసెక్కుల కృష్ణాజలాలు వెళ్లుతున్నట్లు జీఎన్ఎస్ఎస్ డీఈ ఉమా మహేశ్వర్లు తెలిపారు. శనివారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ గండికోట ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26.85 టిఎంసీలు. అందులో ప్రస్తుతం ప్రాజెక్టులో 2.5 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. గండికోటలో క్షేత్రస్థాయిలో నీటి మట్టం తగ్గిందన్నారు. గండికోట జలాశయం వాటర్ లెవెల్ 212 మీటర్ల పూర్తి కేపాసిటీ కాగా ప్రస్తుతం 695 అడుగుల వాటర్ లెవెల్ ఉన్నట్లు ఆయన తెలిపారు.



గండికోట నుంచి మైలవరం జలాశయానికి వెళుతున్న కృష్ణాజలాలు

నూతన ఆవిష్కరణలకు నాయకులుగా ఎదగాలి

కడప ఎడ్యుకేషన్: నేడు ఇంజినీరింగ్ పట్టా పొందిన విద్యార్థులు రేపటి ప్రపంచ నూతన ఆవిష్కరణలకు నాయకులుగా ఎదగాలని అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ జీవీఆర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ 2020–24 బ్యాచ్ విద్యార్థులకు 7వ స్నాతకోత్సవ కార్యక్రమాన్ని కేఓఆర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

27న రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర మహా సభల కరపత్రాలు విడుదల చేస్తున్న రిమ్స్ అధికారులు

కడప అర్బన్ : ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహా సభలను ఈ నెల 27న గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.చిన్నయ్య తెలిపారు. కడప ప్రభుత్వ ఆసుపత్రిలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి, ఆర్‌ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు మహా సభలకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మధుసూదన్, జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, విజయ కుమార్, సహదేవుడు, మోసెస్ ఎజ్రా, జాన్సన్, శరత్, శ్యామ్యూల్, నరసింహ పాల్గొన్నారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి

– మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి,



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్ర ప్రదేశ్‌లో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో పరస్పర సహకార దోరణి అవలంభించాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. కడప ఎస్టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పీఆర్‌సీ సవరించి న్యాయం చేయాలని కోరారు. ఎన్నో ఉద్యమాలతో సాధించుకున్న హెచ్‌ఆర్‌ఏ స్లాబ్, విశ్రాంత ఉద్యోగులకు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పరిమితి తగ్గించరాదని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సునీల్ కుమార్, కడప మండల అధ్యక్షులు జయరాం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తు.. తీసింది ప్రాణం

మద్యం మత్తు ముగ్గురి ప్రాణాలు తీసింది. మద్యం తాగి విచక్షణ కోల్పోయి ఒకరు ఆ మత్తులో భార్యను కొడవలితో నరికి చంపగా.. మరొకరు భార్య అన్నకే మద్యం తాగించి దిమ్మెతో కొట్టి చంపేశాడు. మద్యం తాగి వస్తున్న ఆటో డ్రైవర్‌ను బండరాయితో మోది హత్య చేశారు. శనివారం వేర్వేరు పారంతాల్లో జరిగిన ఈ రెండు సంఘటనలు సంచలనం కలిగించాయి.

• కొడవలితో నరికేశాడు



హత్యకు గురైన రమణమ్మ

కురబలకోట : భర్త తాగుడుకు బానిసై గొడవ పడుతున్నా.. చేసేది లేక కష్టాలను ఆమె తన తలరాతగా భావించింది. కట్టుకున్నాక జీవితమంతా తప్పదన్నట్లుగా తాగుబోతు భర్త పెట్టే బాధలు పంటి కిందే దాచుకుంది. మౌనంగా భరిస్తూ కాలం గడుపుతూ వచ్చింది. ఎంతో మానసికంగా దెబ్బతిన్న ఆ వివాహిత.. భర్త చేతిలోనే చివరికి హతమైంది. కట్టుకున్న భర్తే తాగిన మైకంలో కొడవలితో కిరాతకంగా నరకడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన కురబలకోట మండలంలో శనివారం చోటుచేసుకుంది.

మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. కురబలకోట మండలం మేకలవారిపల్లెకు చెందిన టి.లక్ష్మిరెడ్డి (49) గొర్రెల మేపుతూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య రమణమ్మ(45) కుమారుడు లక్ష్మిరెడ్డి ఉన్నారు. కుమారుడు బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. గత కొద్ది నెలలుగా ఇతడు మద్యానికి బానిసయ్యాడు. తాగుడుకు బానిసైన లక్ష్మిరెడ్డి తరచూ భార్య రమణమ్మతో గొడవపడేవాడు. శుక్రవారం అర్ధరాత్రి మద్యం పూటుగా తాగి ఇంటికి వచ్చాడు. యథాప్రకారం భార్యతో గొడవపడి రోగంతో కోళ్లు చనిపోతే ఎందుకు చెప్పలేదంటూ ప్రశ్నించాడు. ఊర్లో చాలా కోళ్లు చనిపోయాయి మనవే కాదు అని భార్య చెప్పడంతో.. నాకే ఎదురు మాట్లాడుతావా అంటూ ఆగ్రహంతో ఊగి పోయాడు. ఇంట్లో ఉన్న కొడవలి తీసుకుని ఆమె కాళ్లు, చేతులు, కడుపు, తలపై విచక్షణా రహితంగా నరికాడు. ఈ విషయం ఇరుగుపొరుగు వారికి తెలిసినా ఎప్పుడూ ఉండే గొడవే కదా అని మిన్నకుండిపోయారు. తలపై తగిలిన దెబ్బకు తీవ్ర రక్తస్రావ భర్త ముందే రమణమ్మ కుప్పకూలిపోయింది. భార్య చనిపోయిందని తెలుసుకున్న ఎదురింట్లో ఉండే తండ్రి రామిరెడ్డికి తెలిపాడు. ఆ విషయాన్ని స్థానికులకు తెలుపడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ సద్గురుడు ఎస్ఐతో కలసి పరిశీలించారు. భర్త లక్ష్మిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తు దిగాక కట్టుకున్న భార్యను ఎందుకిలా చేశావని పోలీసులు విచారించగా.. కోళ్లు చనిపోయిన విషయం అడిగితే భార్య ఎదురు సమాధానం చెప్పిందని అందుకే నరికేశానని నిట్టూర్చాడు. అతడిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• ఆటో డ్రైవర్ దారుణ హత్య



అర్షద్ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : మద్యం మత్తులో ఉన్న షేక్ అర్షద్(37) శుక్రవారం దారుణ హత్యకు గురయ్యారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని దర్గాబజారుకు చెందిన షేక్ అర్షద్ (37) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు చెల్లెళ్లు, సోదరుడు ఫర్‌ఖుద్ ఉన్నారు. ఇటీవల అర్షద్ మద్యం, గంజాయికి బానిసయ్యాడు. రోజూ ఉదయం వెళ్లి రాత్రి పది గంటలకు ఇంటికి మద్యం తాగి వచ్చేవాడు. కుటుంబ సభ్యులు మందలించినా అతడిలో మార్పురాలేదు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అర్షద్ తిరిగి రాలేదు. రామేశ్వరం రోడ్డులోని మద్యం దుకాణం వద్ద రక్తపు మడుగులో పడి ఉన్న అతడిని బ్లూకోల్ట్స్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బండరాయితో తలపై కొట్టడంతో అతను మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. డీఎస్పీ మురళీధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి సోదరుడు ఫర్షద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ దర్యాప్తులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది.

• బామ్మర్దిని చంపేశాడు



భూమిరెడ్డి నారాయణరెడ్డి

చెన్నూరు : బీమా సొమ్ము కోసం సొంత బామ్మర్దిని అంతమొందించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించాడు ఓ ఘనుడు, ఈ అమానవీయ సంఘటన మండల కేంద్రంలోని చెన్నూరులో జరిగింది. చింతకొమ్మదిన్నె సీఐ ఎపీఎస్.శంకర్ నాయక్ వివరాలకు మేరకు.. మండలం లోని కనపర్తి గ్రామానికి చెందిన భూమిరెడ్డి నారాయణరెడ్డి(38) తన తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్ల కిందట తన సోదరిని చెన్నూరుకు చెందిన బాలగురివిరెడ్డి కుమారుడు పాతకుంట బాలగురుప్రసాద్రెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ సమస్యలతో భూమిరెడ్డి నారాయణరెడ్డి మద్యానికి బానిసై వివాహం చేసుకోలేదు. నారాయణరెడ్డి స్థితి గమనించిన బావ బాలగురుప్రసాద్రెడ్డి అతడితో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.12.5లక్షలకు రెండు బీమా పాలసీలు చేయించారు. వీటికి నామినీగా నారాయణరెడ్డి సోదరిని పాలసీలో కనబరిచారు. తన భార్య పేరు నామినీగా ఉండడంతో బాలగురుప్రసాద్‌రెడ్డికి దుర్మార్గపు ఆలోచన మొదలైంది. తన బామ్మర్ది నారాయణరెడ్డిని అంతమొందించి రోడ్డు ప్రమాదంగా గుర్తిస్తే డబ్బులు వస్తాయని కుట్ర పన్నాడు. ఈ నెల 18న చెన్నూరు శివారులోకి రప్పించి మద్యం తాగించి ఆ మత్తులో ఉన్న బామ్మర్ది నారాయణరెడ్డి తలపై దిమ్మెతో కొట్టి హతమార్చాడు. ఆ మృతదేహాన్ని కడప– కర్నూలు జాతీయ రహదారిపై పడేసి ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి వాహనాలు వెళ్లడంతో మృతదేహం ఛిద్రమవడం చూసి రోడ్డు ప్రమాదంగా గుర్తించి పోలీసులు ఆధార్ కార్డు ఆధారంగా మృతుని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడి అంత్యక్రియల సమయంలో బాలగురుప్రసాద్రెడ్డి ప్రవర్తనలో తేడా చూసిన బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అతడిని తమదైన శైలిలో విచారించడంతో హత్య చేసినట్లు అంగీకరించారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి శనివారం 12గంటలకు కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం



మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తున్న దండా చెంద్రాయుడు

నందలూరు : కడప నుంచి రాజంపేటకు వస్తున్న పల్లె వెలుగు బస్సులో ఆకేపాడు హస్తవరం, కొత్తపల్లికి గ్రామానికి చెందిన దండా చెంద్రాయుడు మద్యం మత్తులో కడపలో బస్సు ఎక్కి టికెట్టు తీసుకోకుండా కండక్టర్, డ్రైవర్, తోటి ప్రయాణికులతో ఘర్షణకు దిగారు. ఇదేమి అన్యాయమని ప్రశ్నించిన మహిళా ప్రయాణికురాలిపై పాదరక్షతో దాడి చేయడంతో నందలూరు పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. మత్తులో పోలీస్ స్టేషన్‌లోనూ వీరంగం సృష్టించాడు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ ఫిర్యాదుతో ఎస్ఐ అబ్దుల్ జహీర్ కేసు నమోదు చేశారు.

జోరుగా ఇసుక అక్రమ రావాణా

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె సమీపంలోని పెన్నానది నుంచి కొందరు రాత్రి వేళల్లో జోరుగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. రాత్రి వేళ అయితే తమకు అడ్డూ, అదుపూ ఉండదని, కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. మూలపల్లె నుంచి బండికనుమ దారి వెంబడి తరలించే టపుడు సమాచారం ఇచ్చేందుకు కొందరు పైలెట్లను ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలిసింది. అయితే రాత్రి పూట ట్రాక్టర్లు తిరుగుతుండడంతో స్థానికులకు నిద్రా భంగం కల్గుతోందని చెబుతున్నారు. అక్రమ రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారు ఆభరణాల చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూజ్ టీమ్

పెనగలూరు(ఓబులవారిపల్లె) : మండలంలోని పెనగలూరులో నివాసముంటున్న గుంటుపల్లి పద్మ ఇంట్లో బీరువా తెరి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లినట్లు ఎస్ఐ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలలో హరికథా కాలక్షేపానికి వెళ్లిన పద్మ శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరచి ఉండడం గమనించింది. అందులో దాచిన బంగారు సరుడు, లాంగ్ చైన్, మూడు ఉంగరాలు, నగదు తీసుకెళ్లినట్లు తెలుసుకుని ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి రాజంపేట క్లూజ్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించామని, సీసీ కెమేరా ఆనవాళ్లు పరిశీలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గిరిజనుడికి న్యాయం చేయాలి



తండా వాసులతో మాట్లాడుతున్న నాయకులు

పెద్దమండ్యం : మండలంలోని వడ్డింవకతండాకు చెందిన గిరిజనుడు రవినాయక్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఏపీ గిరిజన సమాఖ్య కార్యదర్శి విశ్వనాథ నాయక్, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మండలం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. వడ్డివంకతండాకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తండా వాసులతో ఆయన మాట్లాడారు. దాడికి దారి తీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు విచారణాధికారిగా ఉన్న మదనపల్లె డీఎస్పీ నిష్పక్షపాతంగా, సమగ్రంగా దర్యాప్తు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. పోలీసులు స్పందించి తండాలో పికెటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు న్యాయం చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

టీడీపీ నేత ఖాదర్‌వలి మనుషులే దాడి చేశారు

విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాయచోటి టౌన్ : టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి మనుషులే వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల ఇళ్లపై దాడిచేశారని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ నాయకులు పేర్కొన్నారు. రాయచోటి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో కౌన్సిలర్ హారూన్‌బాషా, తదితరులు మాట్లాడుతూ ఈ నెల 20న అర్ధరాత్రి టీడీపీ పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి పెంచి పోషిస్తున్న రౌడీలే మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. పోలీసులు అదుపులోకి తీసుకుటే వారిని విడిపించకపోవడడానికి స్టేషన్‌కు వచ్చింది.. ఆయన కాదా అని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడి చేయించి అధికార దర్పాన్ని పొందాలనే దురుద్దేశంతో ఈ ఘాతుకానికి పాల్పడ్డారన్నారు. తన చేతిలో ఉన్న సోషియల్ మీడియాను ఉపయోగించుకొని వీడియోలతో వైఎసీపీ వారేనంటూ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. కేసు లేకుండా చేయడానికి పోలీసులపై ఒత్తిడి తెచ్చిన విషయం అందరికీ తెలుసన్నారు. ఎన్నికల సమయంలో మున్సిపల్ చైర్మన్ పదవి ఇస్తే వైఎస్సార్‌సీపీలో చేరతానని తమ నాయకుడితో చర్చలు జరిపిన ఖాధర్‌వలి ఇపుడు తన స్వార్థపూరిత రాజకీయాల కోసం ఇలాంటి పనులు చేయడం తగదన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కూల్చడం చట్ట విరుద్ధం



జింకా విజయలక్ష్మి

ప్రొద్దుటూరు : తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని టీడీపీ ప్రభుత్వం కూల్చడం చట్ట విరుద్ధమని పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ జింకా విజయలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో శనివారం ఆమె మాట్లాడుతూ.. కరకట్ట మీద కట్టడాలు చట్ట వ్యతిరేకమని, వర్షం వస్తే నీళ్లు వచ్చి ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని జగన్ ప్రభుత్వం అప్పటి అక్రమ కట్టడాన్ని కూల్చడం చట్టబద్ధమన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని కోర్టు ప్రొసీడింగ్స్‌లో ఉండగా కూల్చడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య అని, న్యాయ వ్యవస్థ మీద గౌరవం లేదు, దురహంకార చర్య అని, దీనికి ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి 20 రోజులు గడవకుండానే సంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు.

నకిలీ పాసులతో బస్సు ప్రయాణం





పట్టుకున్న నకిలీ పాసులు, బహుమతి ప్రదానం చేస్తున్న డీఎం ఢిల్లీశ్వర్‌రావు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఓ ప్రయాణికుడు నకిలీ సీజన్ టికెట్‌తో ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ కండక్టర్‌కు అడ్డంగా దొరికిపోయాడు. కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. కడప– ప్రొద్దుటూరు మధ్య పల్లె వెలుగు సర్వీసులో మైదుకూరు నుంచి ప్రొద్దుటూరుకు రూ.1200 విలువైన సీజన్ టికెట్ చూపుతూ పి.చిన్న చెన్నయ్య(33) ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్నారు. సీజన్ పాస్‌ను కండక్టర్ పరిశీలించినప్పుడు సీజన్ టికెట్‌పై హోలోగ్రామ్ ఫొటోస్టాట్ కాపీ కనిపించడంతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని ప్రొద్దుటూరు పోలీసులకు అప్పగించారు. అప్రమత్తంగా వ్యవహరించిన కండక్టర్ ప్రమీలను డీఎం అభినందించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, కండక్టర్లు పాల్గొన్నారు.

నర్సింగు పల్లెలో స్థల వివాదం



వివాదానికి కారణమైన కోనేరు స్థలం

పోరుమామిళ్ల : గ్రామ నత్తంగా భావించే స్థలాన్ని ఓ యువకుడు తనదంటూ చెప్పడంతో వివాదం నెలకొంది. స్థానికుల వివరాల మేరకు.. రంగసముద్రం పంచాయతీ నర్సింగుపల్లెలో గతంలో ఓ కోనేరు ఉన్న స్థలం గ్రామకంఠమని భావించి స్థానికులు గుడి కట్టాలని నిర్ణయించారు. శనివారం ఆ స్థలంలో కంప చెట్లు తొలగిస్తుండగా.. యువకుడు గంపా శ్రీను వచ్చి ఆ స్థలం తనదని, 1981లో పట్టా ఇచ్చారని చెప్పి పనులను అడ్డుకున్నాడు. గ్రామ కంఠంలో నీకు పట్టా ఎలా వచ్చిందని స్థానికులు నిలదీశారు. రెవిన్యూ అధికారులతో కుమ్మక్కై పట్టా చేయించుకున్నావంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో సమస్య పోలీస్ స్టేషన్‌కు చేరింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి గ్రామస్థులను విచారించి తహశీల్దారుకు నివేదిక పంపుతామని, ఆయన పరిశీలించి న్యాయం చేస్తారని హామీ ఇచ్చారు.

టీడీపీలో ఆధిపత్య పోరు

– అట్లూరులో ఇరువర్గాల ఘర్షణ



గాయపడిన నాగమునెయ్య

అట్లూరు : మేమంటే.. మేమంటూ వాగ్వాదానికి దిగి అట్లూరు గ్రామంలోని టీడీపీకి చెందిన ఇరువర్గాలు పరస్పరం ఘర్షణ పడడంతో ఒకరికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఇరు వర్గాలు ఒక చోట చేరాయి. ఇంతలో అట్లూరు క్రాస్ రోడ్డులోని తమ నాయకుడు చెప్పినట్లు వింటే.. మీ పనులు జరుగుతాయ్ అంటూ ఓ వర్గం... నిన్న,మొన్న పార్టీలోకి వచ్చి మీ పెత్తనం ఏమిటంటూ మరో వర్గం వాగ్వాదం మొదలెట్టాయి. చిలికి చిలికి గాలివానలా మారడంతో ఈ వివాదం కాస్త ఘర్షణకు దారి తీసింది. పరస్పరం దాడులు చేసుకోవడంతో నాగమునెయ్య అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఓ వర్గానికి చెందిన బాలకృష్ణ, రుషికేశవ, రెడ్డెయ్యతోపాటు మరో ముగ్గురు. అలాగే నాగమునెయ్య, శివాతో పాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ కేసీ.రాజు తెలిపారు.

వాహనం కొంటున్నారా..
జర భద్రం

బైక్ కొనాలని చాలామందికి ఉంటుంది. కొత్తది కొనాలంటే కొంతమందికి ఆర్థిక పరిస్థితి సహకరించకపోవచ్చు. అలాంటి వారు తక్కువ ధరకే బైక్ సొంతం చేసుకోవాలని ప్రయత్నిస్తుంటారు. అదే సందర్భంలో పాత వాహనాల విక్రయాలు అదే స్థాయిలో జరుగుతున్నాయి. అయితే పాత వాహనం కొంటున్న వారు కొన్ని జాగ్రత్తలు పాటించకపోతే చిక్కులు తప్పవని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.. అవేంటో చూసేద్దాం.



- 29, 30 ఫారాల్లో సంతకాలు తప్పనిసరి
- ఒప్పంద పత్రాలతో విక్రయదారుకే నష్టం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఒక వ్యక్తి పేరిట కొన్న బైక్‌ను ఇతరులకు విక్రయించేటపుడు సేల్ అగ్రిమెంట్ పత్రం రాసుకుంటే సరిపోదు. ఆ తర్వాత లేనిపోని చిక్కుల్లో ఇరుక్కు పోవాల్సిందే. పోలీసులు ఈ–చలానా విధించినా ఆ భారం మీరు మోయాల్సిందే మరి. పాత వాహనాన్ని అమ్మిన సమయంలో చిన్న బాండు పేపర్‌తో ఒప్పందాలు చేసుకొని విక్రయించడం తగదని, కొన్న వినియోగదారుడు రిజిస్ట్రేషన్ చేసుకోకుండా నడిపిస్తే అమ్మిన వ్యక్తికే నష్టమని అధికారులు చెబుతున్నారు. జరిమానా పడిన అనంతరం ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా.. వారు వినే పరిస్థితి ఉండదు. కాగితాలు చూస్తే నమ్మరు. అలాంటప్పుడు సేల్‌డీడ్ అగ్రిమెంట్ కాగితాలు ఉండడం మంచిది. సరైన అవగాహన లేకపోవడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారు. దీంతో అమ్మిన వారేగాక.. కొన్న వారు లేనిపోని చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

జోరుగా బేరాలు

నగరం, పట్టణం, మండల స్థాయిలో వాహనాల అమ్మకాలు, కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మధ్య వర్తుల ఆధ్వర్యంలో ఇష్టం వచ్చినట్లు క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. కొనుగోలు చేసిన వారు వారం, పదిరోజుల్లోపు యాజమాన్య హక్కులు మార్చుకుంటే ఎలాంటి ఇబ్బందులుండవని అధికారులు చెబుతున్నారు. ఆలస్యం చేస్తే జరిమానా విధించే అవకాశముందని హెచ్చరిస్తున్నారు.

29, 30 ఫారాలు ముఖ్యం...

వాహనాలు కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా, లాంటి ధ్రువీకరణ పత్రాలపై సంతకాలు చేయించుకోవడం ముఖ్యం. వాటితోపాటు ఫారం 29 రెండు కాపీలు, ఫారం 30పై విక్రయించిన వారి సంతకాలు తీసుకుంటే యాజమాన్య హక్కుల బదిలీ సులభమవుతుంది. పాత వాహనం అమ్మేశాక ఆ హక్కులు బదిలీ చేసుకోకపోతే కష్టాలు తప్పవు. కొత్తగా మరో వాహనం కొన్నప్పుడు ఇబ్బందులు ఎదురు కావు. ఈ విషయంపై అవగాహన లేక పలువురు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నారు. ఇకనైనా వాహనం అమ్మిన వెంటనే ఇరు వైపులా యాజమాన్య హక్కులు మార్చుకోవాలని రవాణా శాఖ అధికారులు సూచిస్తున్నారు.

వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



పాత వాహనాలను కొన్న వెంటనే ఆర్సీ, బీమా, కాలుష్యం, చిరునామా, ఇతర ధృవ పత్రాలపై సంతకాలు చేయించుకొని పేరు, చిరునామా మార్చుకోవాలి. ఇది చాలా ముఖ్యం. తప్పనిసరిగా కొనుగోలుదారుడు చూసుకోవాలి. – ఈ.మీరాప్రసాద్, జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్

గంజాయి రవాణా కేసులో ఒకరి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం : మండల సరిహద్దులోని సంద్రడవి అటవీ ప్రాంతంలో ఈ ఏడాది ఫిబ్రవరి 5న జరిగిన పోలీసుల దాడుల్లో రెండు కార్లతోపాటు వంద కిలోల గంజాయి పట్టుబడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కేసు సమగ్ర విచారణలో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని ములకలచెరువు సీఐ తమ్మిశెట్టి మధు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో 8 మందిని అరెస్టు చేయగా తాజాగా మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీ కాయల్లోల్లపల్లికి చెందిన అక్కినపల్లి శివ(25)ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని సీఐ వెల్లడించారు.

నేడు ప్రతిభా పురస్కారాల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దేవాంగ విద్యార్థులకు ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రతిభా పురస్కారాలను అందించనున్నారు. ఈ విషయాన్ని సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ పురస్కారాలను అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ఆర్జేడీ గుత్తి రాజారావు, ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి పూతిక ఈశ్వరనాథ్, హైకోర్టు న్యాయవాది పి.శ్రీనివాస్, రిటైర్డ్ ఎస్ఈ బత్తల వెంకటసుబ్బయ్య, న్యాయవాది గొర్రె శ్రీనివాసులు పాల్గొంటారన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిధిలోని శేషారెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మురళీమోహన్ తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు..శేషారెడ్డిపల్లెకు వెళ్లే దారిలోని రైల్వే గేట్ వద్ద మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి చూడగా అప్పటికే అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వెంటనే అతడిని 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుడి చేతిపై నిఖిత అని పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని పోస్ట్ మార్టం గదిలో ఉంచినట్లు ఆయన తెలిపారు.